

# అమెరి "కలగూరగంప" కామెడి
## వంగూరి చిట్టెన్ రాజు



## మర్చిపోలేని 2012 మార్చ్ నెల

15

**నాకు అప్పుడప్పుడు ఒక్కో నెల బాగా కలిసివస్తుంది.** ఎటునుంచి ఎటు చూసినా ఈ ఏడు మార్చ్ నెల మూడు సదస్సులూ- నాలుగు పొగడ్తలూ- ఆరు ఈ-మెయిల్ చివాట్లు గానే ఉంది. పైగా మార్చ్‌లోనే మా ఆవిడ పుట్టిన రోజు.

మొదట, మార్చ్ పది, పదకొండు, 2012 తారీకులలో హ్యూస్టన్ నగరంలోని సైంట్ థామస్ యూనివర్సిటీ జోన్స్‌హాల్ ప్రాగణంలో జరిగిన మూడవ ప్రపంచ సాహితీ సదస్సు అ నూహ్యమైన స్థాయిలో విజయవంతంగా ముగిసింది. ఉత్తర అమెరికా అంతటినుంచే కాక, భారత దేశం, ఇంగ్లండ్, కెనెడా, మధ్య ప్రాచ్య దేశాలూ, ప్రాన్స్, సింగపూర్ దేశాల నుంచి రెండు వందల యాభై మందికి పైగా అతిథులతో, అతిరథ, మహారథులతో పండుగ వాతావరణంలో జరిగిన ఈ తెలుగు సాహిత్య సమావేశాలు భారత దేశం ఎల్లల దాటి విదేశాలలో కేవలం తెలుగు భాషా, సాహిత్యాలకి మాత్రమే ప్రాధాన్యత ఇచ్చిన మొట్టమొదటి సమావేశంగా నేను ప్రారంభ సభలో ప్రకటించగానే "అవును సుమా" అని కొందరు తప్పట్లు కొట్టారు, నేను అలా భుజాలు ఎగరేసుకోవడం నచ్చని నా గాఢ మిత్రులూ-గూఢ శత్రువులూ మటుకు తప్పట్లు కొట్టినట్టు నటించారు. బయట నుంచుని ఇంకా కాఫీలు తాగుతున్న వాళ్ళూ, లోపలికి రావడానికి "అయ్య బాబోయ్, యాభై డాలర్లు కట్టాలా, మా బావమరిది కట్టాడుగా, నేను ఒక గంట కూచుని మధ్యాహ్నం భోజనం అవగానే వెళ్ళిపోతాను" అని నమోదు బల్ల దగ్గర ధర్నా చేస్తున్న వాళ్ళూ "ఓహో, సభ మొదలయ్యింది కాబోలు" అని లోపలికి రాగానే, నేను వాళ్ళని చూసి, కొంచెం భాష మార్చేసి మరొక సారి అదే ప్రకటన చేసేసి మరికొన్ని తప్పట్లు కొట్టించుకున్నాను. ఈ మహాసభల తాత్పర్యం అంతా ఎవరు, ఎంత మంది చేత, ఎన్ని సార్లు, ఎంత హెచ్చు స్థాయిలో తప్పట్లు కొట్టించుకుంటారో అనే కదా!

ఈ మూడవ ప్రపంచ తెలుగు సాహితీ సదస్సుకి ప్రధాన అతిథులు "కళాప్రపూర్ణ" డా. అవసరాల (వింజమూరి) అనసూయాదేవి, శ్రీమతి డి.కామేశ్వరి, శ్రీ అక్కిరాజు రమాపతిరావు, శ్రీ భువనచంద్ర, "పద్మశ్రీ" యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, కేంద్ర సాహిత్య ఎకాడేమీ (ఢిల్లీ) నుంచి కె. శ్రీనివాస రావు గారు, శ్రీ ద్వా.నా. శాస్త్రి, శ్రీ వేల్చేరు నారాయణరావు, శ్రీ పెమ్మరాజు వేణుగోపాల రావు. నందుల సుశీలా దేవి గారు, తెన్నేటి సుధాదేవి గారూ, వంశీ రామరాజు గారూ, గురు సహస్రావధాని శ్రీ డా.కడిమెళ్ళ వరప్రసాద్, సహస్రావధాని శ్రీ కోట లక్ష్మీనరసింహం, వల్లూరి రేవతి గారు కాగా పారిస్ నుంచి వచ్చిన ఫ్రెంచ్ పౌరుడు డానియేల్ నెగెర్స్ తెలుగు భాషలో ఎక్కడా ఫ్రెంచ్ పదం కానీ, ఆంగ్ల పదం కానీ లేకుండా అరగంట పైగా మాట్లాడి అందరినీ ఆశ్చర్యపరిచారు. ఆయన "యాస"

ఈ రోజుల్లో మన సినీ హీరోల "బాస" కన్నా బావుంది. పైగా ఆయన ఎంత అమాయకుడో నాకు తెలియదు కానీ మన పోతన భాగవతాన్ని ఫ్రెంచ్ భాషలోకి అనువదిస్తున్నాడుట. పోతన తెలంగాణా వాడా, రాయల సీమ వాడా అని తన్నుకు చస్తూ టేంక్ బండ్ మీద ఆయన విగ్రహాన్ని మనం పడగొట్టేశాం అని ఈ ఫ్రెంచ్ మేధావికి తెలియదేమో? ఇక ఇంగ్లండ్ నుంచి వచ్చిన మూర్తి జొన్నల గడ్డ, రామకృష్ణ మాదిన గారూ మంచి కవితలతో అందరినీ అలరిస్తే, యెమెన్ నుంచి వచ్చిన బి.వి. రమణ, ఆయన సతీమణి శారదా "పాండవోద్యోగ విజయాలు" పద్యాలతో నా చెవుల తుప్పు వదలగొట్టారు. సింగపూర్ నుంచి వచ్చినాయన వేదిక ఎక్క లేదు కానీ మా కార్యకర్తలలో కలిసిపోయి అందరికీ అన్నం వడ్డించి, కాఫీలు సరఫరా చేసి సేవ చేశారు. ఇక ఉత్తర అమెరికా నుంచి మిత్రులు కిరణ్ ప్రభ, రావు తల్లాప్రగడ, జంపాల చౌదరి, వేమూరి వెంకటేశ్వర రావు, సత్యం మందపాటి, శారదా పూర్ణ శొంఠి, ఇన్నయ్యా నరిసెట్టి మొదలైన వారు ప్రత్యేక ఆహ్వానితులుగా ఈ మహా సభలలో పాల్గొన్నారు.

"వీళ్ళంతా నీ గురించి వచ్చారని గొప్పలు చెప్పుకుంటున్నావేమో! అసలు నేను ఎలా ఉంటానో చూద్దామని వచ్చామని అంతా నాకు చెప్పారులే" అంది వెనకాల గుమ్మంలోంచి సభాంగణ ప్రవేశం చేసి కాస్సేపు కూచున్న మా క్వీన్ విక్టోరియా. నేను అక్కిరాజు రమాపతి రావు గారికీ, డి. కామేశ్వరి గారికీ జీవన సాఫల్య పురస్కారం ఇస్తూండగా పనిలో పనిగా నాకూ, మా ఆవిడకీ కూడా "టోపీ" పెట్టారు మా నిర్వాహక బృందం. దాన్నే కిట్టని వాళ్ళు "డబ్బిచ్చి చేయించుకునే సన్మానం" అని అన్నా, నాకూ, మా ఆవిడకీ కూడా సన్మానం జరిగిన కారణాన ఈ మహా సభలు బ్రహ్మాండంగానే జరిగాయి అని నా అభిప్రాయం. పనిలో పనిగా అందరి తరఫునా ఘనత వహించిన ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వానికి "తెలుగు భాషా, సాహిత్యాలని పరిరక్షించుకొనుటకు మా సూచనలు" అనే ఒక ఏకగ్రీవ తీర్మానం కూడా చేశాం. ఈ తీర్మానాన్ని గవర్నర్ గారికీ, ముఖ్యమంత్రిగారికీ, మంత్రులకీ, శాసన సభ్యులకీ, శాసన మండలి సభ్యులకీ పంపిస్తున్నాను. "దాన్ని ఇంగ్లీషులోనూ, హిందీలోనూ, ఉర్దూలోనూ కూడా తర్జుమా చేసి పంపించు, కొంతమందికైనా అర్థం అవుతుంది" అని సలహా ఇచ్చింది మా క్వీన్ విక్టోరియా. మొత్తానికి ఈ మూడవ ప్రపంచ తెలుగు సాహితీ సదస్సు మార్చ్ నెలలో చైత్ర మాసమూ, వసంత ఋతువు ప్రవేశం అవుతున్న ఉగాది సమయంలో, మా హ్యూస్టన్‌లో పూసిన మొదటి సాహిత్యం పువ్వు. టీవీ 9 వారు ఈ సదస్సు వివరాలు ఏదో వార్తలలో అర నిముషం కాకుండా ఒక ప్రత్యేక కార్యక్రమంగా ప్రసారం చేశారు. వీలుంటే ఈ క్రింది లంకె చూడండి. ఇలాంటి వార్తా విశేషాలన్నీ క్రోడీకరించి త్వరలోనే ప్రకటిద్దామని అనుకుంటున్నాను.

http://m.youtube.com/watch?v=ZfLqZfwJtZ0

ఆ తరువాతి వారం డల్లాస్ వారి 56 వ "నెల నెలా తెలుగు వెన్నెల" మరియు మా టెక్సస్ సాహితీవేత్తలందరూ కలిసి ప్రతీ ఆరు నెలలకీ జరుపుకునే 28వ టెక్సస్ సాహిత్య సదస్సు మార్చ్ 17, 2012 నాడు జరిగింది. ఆ సదస్సుకి కూడా భారత దేశం నుండి హ్యూస్టన్ వచ్చిన వారిలో చాలా మంది పాల్గొన్నారు. హ్యూస్టన్‌లో నా వాలకం చూసిన మిత్రులందరూ ఈ సారి ఎక్కువ డేమేజీ అవకుండా ఉండడం కోసం నన్ను స్టేజ్ చుట్టుపక్కలకి రానివ్వకుండా జాగ్రత్త పడ్డారు. అందు చేత నేను కేవలం ప్రేక్షకులలోనే కూచుని నా తాలూకు తప్పట్లు విరివిగా కొట్టీ, కొండొకచో కొట్టలేకా ఆ సదస్సు విజయానికి కారకుణ్ణి అయ్యాను. అఫ్ కోర్స్, చివర జరిగిన సత్కారాల సమయంలో నా చేత కూడా అవధానులకి "టోపీ" పెట్టించారు. "నువ్వు వెళ్ళకపోతే, ఆ సభ మరింత దిగ్విజయంగా జరిగేది, ఈ నాడులో కనీసం నాలుగు ఫొటోలు పడేవి. నీ మూలాన్న ఒక్కటే వేశారు, అదైనా అందులో నువ్వు లేకుండా జాగ్రత్త పడ్డారు." అని వ్యాఖ్యానించింది మా క్వీన్ విక్టోరియా. ఏ నాడూ చూడని ఆవిడ ఈ నాడు "ఈనాడు" ఎందుకు చూసిందో ఏ నాటికీ నాకు తెలియదు. ఈ డాలస్ సదస్సు మార్చ్, 2012 లో సాహిత్య పరిమళాలతో పూసిన మరో పువ్వు.

ఆ తరువాతి వారం ..అంటే మార్చ్ 24, 2012...అనగా నందన నామ సంవత్సర ఉగాది నాడు న్యూయార్క్ మహానగరంలో మూడో సాహిత్యం పువ్వు గుబాళించింది. అక్కడ "తెలుసునా" అనే సాహిత్య బృందం వారు వారి నెల నెలా సమావేశానికి నన్ను

ఆహ్వానించారు. ఇక్కడ గమనించ వలసిన విషయం ఏమిటంటే "ఆహ్వానించారు" అంటే "ఖర్చులు చాలా మటుకు వాళ్ళు పెట్టుకున్నారూ" అని అర్ధం. అదే విధంగా పైన ఉన్న మొదటి పువ్వు వివరణలో "ఆహ్వానిత అతిథులు", "ప్రత్యేక ఆహ్వానితులు" వగైరా మాటలకి "ఖర్చులు చాలా మటుకు నేను పెట్టుకున్నాను" అని అర్ధం. న్యూయార్క్ నగర ప్రాంతాలలో "తెలుసునా" (www.telusuna.org) కనీసం 2005 డిశంబర్ నుంచీ (వారి వెబ్ సైట్ ప్రకారం) ఎక్కడా నా లాగా "డబ్బాడంబరం" కొట్టుకోకుండా...అనగా, "డబ్బు విరాళం ఇస్తావా , చస్తావా" అని కానీ, "సాహిత్యంలో నమిలేశాం, పొడిచేశాం" అని ఆడంబరంగా చెప్పుకోవడం కానీ లేకుండా..ఒకటా...రెండా...సుమారు డభై తెలుగు సాహిత్య సమావేశాలు నిర్వహించారు. అటువంటి సాహితీవేత్తలు నా బోటి సాధారణ మానవుణ్ణి తమ సభలకి ఆహ్వానించడంతో నేను నా ట్రేడ్ మార్క్ ఎర్రచొక్కా వేసుకుని తగుదునమ్మా అని  అక్కడికి వెళ్ళాను. ఆ సభలకి నాకు అనేక సంవత్సరాలగా తెలిసిన హేమా హేమీలు చాలా మంది వచ్చారు. ముందు సుమారు రెండు గంటల పాటు రకరకాల సరదా ఆటపాటలతో మంచి కాలక్షేపం అయింది. అప్పుడు సభా నిర్వాహకులు గారు, నన్ను అరగంట సేపు పరిచయం చేసి, తేనీరు విరామం తరువాత నేను మాట్లాడతాను అని ప్రకటించారు. "అమ్మయ్య" అనుకుని, అర్జంటుగా లేచి తేనీరు, పకోడీలూ, బిస్కట్లు ఖాళీ చేసి, సభ మొదట్లో ఉన్న యాభై మందిలోనూ పాతిక మంది తేనీరు విరామం అవగానే నేను మాట్లాడడానికి ముందే కూరలు కొనుక్కునే అత్యవసర కార్యక్రమం వలనా, వేరే పనుల మీద అర్జంటుగా పారిపోయారు. ఇక నా సుత్తి వినడానికి మిగిలినదల్లా నా చిరకాల మిత్రులూ, నిర్వాహకులూ, ఇంటి యజమానులూనూ. ఎంత సుత్తికి అంత గాలి అంటారు కదా! అందుకే నేను ఎప్పుడు సభలు పెట్టినా, నా స్పీచ్ అయిన తరవాతే తేనీరు కానీ భోజన విరామం కానీ ఇస్తాను. వీలుంటే హాలు తలుపులు గట్టిగా వేసేస్తాను.

ఇక, అక్కడ కాకినాడలో కూడా ఈ మార్చ్ ఉగాది నుంచి మొదలుపెట్టి నెల నెలా సాహిత్య కార్యక్రమాలకి నాందీ ప్రస్తావన జరిగింది. ఎందుకంటే, నా చిరు ప్రోద్భలంతో, కాకినాడలో నందన నామ ఉగాదితో ప్రారంభించి "ఆంధ్ర సారస్వత పరిషత్" శత వార్షికోత్సవాలు ఈ సంవత్సరం ప్రతీ నెలా జరుగుతాయి. జయంతి రామయ్య పంతులు, కందుకూరి వీరేశలింగం గార్ల ప్రోత్సాహంతో పిఠాపురం మహారాజా వారు 1911 కాకినాడలో ప్రారంభించిన ఈ ఆంధ్ర సాహిత్య పరిషత్ గత శతాబ్దంలో తెలుగు నాట ప్రారంభింపబడిన తొలి సాహితీ సంస్థగా గుర్తింపు పొంది, పుస్తక ప్రచురణలూ, సాహిత్య గోష్ఠులూ, పండితుల సత్కారాలూ, సాహిత్య పత్రికా ప్రచురణలూ మొదలైన అనేక విధాలుగా అనిర్వచనీయమైన సాహిత్య సేవలు ఇప్పటికీ అందిస్తోంది.  సుప్రసిద్ధమైన సూర్యరాయాంధ్ర నిఘంటువు ఈ సంస్థ ప్రచురణే. ఈ సంస్థ గ్రంథాలయంలో అపురూపమైన తాళ పత్ర గ్రంధాలు భద్రపరచబడి, తెలుగు సాహిత్యానికి ఒక ప్రధాన పరిశోధన శాలగా ఉపయోగపడుతోంది. ఈ శత జయంతి ఉత్సవాలు మొన్న మార్చ్ ఉగాది నాడు అష్టావధానంతో ప్రారంభం అయ్యాయి. తూర్పు గోదావరి జిల్లా రచయితల సంఘం (శ్రీమతి చిరంజీవినీ కుమారి) మరియు యంగ్మెన్స్ అసోసియేషన్ (శ్రీ దంటు సూర్యారావు) ప్రధాన నిర్వహకులు. మా ఆధ్వర్యంలో హైదరాబాదులో గత ఐదు సంవత్సరాలగా ప్రతీ నెలా ఒక సాహిత్య కార్యక్రమం జరుగుతున్న సంగతి అందరికీ తెలిసినదే కదా! బతికి బావుంటే, అమెరికాలో ప్రతీ రాష్ట్రంలోనూ, తెలుగు నాట ప్రతీ జిల్లాలోనూ ఇలాంటి సాహిత్యం పండగలు జరుపుకోవాలని ఉంది.

ఐతే ఈ ఏప్రిల్ నెలలోనే నా పుట్టిన రోజూ, క్వీన్ విక్టోరియాతో మా పెళ్ళి రోజూ వగైరా కారణాల వల్ల ఈ నెల అర్జంటుగా మర్చిపోవాలేమో అని నా అనుమానం.

Post your comments